క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

జనగామ రూరల్: పట్టణంలోని బతుకమ్మకుంటలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు బూడిద గోపి, సౌందర్య, వెంకటేష్, సోమేష్, కనకాచారి, సురేష్, యాకయ్య, తదితరులు ఉన్నారు.

నేడు ఫౌండేషన్ వేడుకలు

బచ్చన్నపేట: వాస్విక్ ఫౌండేషన్ 5వ వార్షికోత్సవ వేడులను గురువారం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్, వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఫౌండేషన్ స్థాపించి 5 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు పండ్లు, స్వీట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రేపు సత్యనారాయణ వ్రతాలు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో రేపు(శుక్రవారం) సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న బుధవారం తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు రవీందర్‌శర్మ, అర్చకుడు రంగాచార్యులు, కృష్ణమాచార్యులతో కలిసి ఆమె మాట్లాడారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకం అనంతరం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారయణ వ్రతాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటలకు మొదటి విడత, 11 గంటలకు రెండో విడత సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో జంట రూ. 516 చెల్లించి వ్రతంలో పాల్గొనాలని ఈఓ కోరారు.

16 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ ఆలయంలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆలయం ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా కార్యక్రమాల వివరాలను బుధవారం పద్మశాలి సంఘం బాధ్యులు పేరాల రాజమౌళి, బత్తుల రాజన్‌బాబులు తెలిపారు. 16న ఉదయం గణపతిపూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 17న మహాహారతి, పద్మశాలి కులస్తులతో సామూహిక హోమం, 18న యంత్ర భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన, మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

పాలకుర్తి: గ్రామాల్లో నిర్వహించే పశు వైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి అశోక్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని రాఘవపురంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ప్రియాంక, శివప్రసాద్, రాజేశ్వర్‌రావు, సమ్మయ్య, మధుమోహన్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

బచ్చన్నపేట: బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన అబ్బాయిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన అబ్బాయి (16) బచ్చన్నపేట మండలంలోని బాలిక (17)ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేసినట్లు తెలిపారు. ఇప్పుడు పెళ్లి చేసుకోనని అబ్బాయి తెలుపడంతో అమ్మాయి తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు బాలికను భరోసా కేంద్రానికి తరలించి అబ్బాయిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. అబ్బాయిని జువైనల్ కోర్టుకు తరలిస్తామని తెలిపారు.

వైభవంగా శివకల్యాణం

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరులో నాగేశం మహదేవస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు దేవగిరి సంతోష్, పెద్దాపురం వెంకటేశ్వరశర్మ, మోటకోడూరు సాయి ప్రణీత్, వివేకశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం పూజలు చేసి ఉత్సవాలు నిర్వహించారు. భక్తరామదాసు భజన మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మాన్యపు సిద్దేశ్వర్, భజన మండలి భక్తులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అడ్డుకోవాలి

చిల్పూరు: రాజవరం గ్రామ సమీపంలోని తాళ్లబాట వాగులో ఇసుకను అక్రమంగా డంప్ చేసి రాత్రి వేళలో ట్రాక్టర్ల ద్వారా తరలించడాన్ని అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. ట్రాక్టర్లను ఇష్టానుసారంగా దారిలో తీసుకెళ్తుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు.

అవగాహన

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో బుధవారం ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ విద్యార్థులకు సైబర్ క్రైం నివారణపై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై తల్లిదండ్రులు జాగ్రత్తపడేవిధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- పాంనూర్–నమిలిగొండ రహదారికి శంకుస్థాపన చేసి నాలుగేళ్లు
- ప్రజలకు తప్పని తిప్పలు


కంకరవేసి వదిలేసిన పాంనూర్–నమిలిగొండ రోడ్డు

స్టేషన్‌ఘన్‌పూర్: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో మండలంలోని పాంనూర్ నుంచి నమిలిగొండ గ్రామానికి వెళ్లే రోడ్డు పనులకు నాలుగేళ్లుగా మోక్షం కలుగడం లేదు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ రోడ్డుపై కంకరపోసి వదిలేయగా ఆరోడ్డు వెంట వెళ్లే వాహనదారులు పాట్లు పడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాంనూర్ గ్రామం నుంచి నమిలిగొండ గ్రామానికి వెళ్లే రోడ్డు ఏళ్ల తరబడి మట్టిరోడ్డుగా ఉండేది. మట్టి రోడ్డుపై గుంతలు, వర్షాకాలంతో బురదతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. దాంతో గ్రామానికి చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఎట్టకేలకు పాంనూర్–నమిలిగొండ వరకు 3 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రూ.1.46 కోటి నిధులు మంజూరయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య 2021 జూన్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దాంతో ఇక రోడ్డు కష్టాలు తీరుతాయని రెండు గ్రామాల ప్రజలు భావించారు. అయితే వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. సదరు పనులను చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డు పనులు తూతూమంత్రంగా అసంపూర్తిగా చేశాడు. రోడ్డుపై కేవలం కంకర పోసి బీటీ పోయకుండా వదిలేశాడు. దాంతో ప్రజలు, వాహనదారులకు రోడ్డు కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. దాదాపు రెండేళ్లుగా ప్రజలు కంకరరోడ్డుపై ప్రయాణంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి రోడ్డు సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సమస్యతో తీవ్ర ఇబ్బందులు



పాంనూర్–నమిలిగొండ రోడ్డు సమస్యతో ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ప్రధానంగా రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో వాహనదారులు అవస్థల పాలవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

– డాక్టర్ పొన్న బీరయ్య, పాంనూర్

నాలుగేళ్లుగా నరకయాతన



పాంనూర్–నమిలిగొండ రోడ్డుతో ప్రజలకు నాలుగేళ్లుగా ఇబ్బందిగా ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుత పాలకులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– గాదె రాజు, నమిలిగొండ

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి


కొడకండ్ల: సర్వేను పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్

కొడకండ్ల: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ కోరారు. బుధవారం మండలంలోని నర్సింగాపురం గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను వేగవంతం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సమగ్ర సర్వేను మరింత వేగవంతంగా చేపట్టేలా సూపర్‌వైజర్లు పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి, ఘన్‌పూర్ మండల ప్రత్యేక అధికారి నాగపురి స్వరూపరాణి అన్నారు. ఇంటింటి సర్వేకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో డీపీఓ బుధవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్యుమరేటర్ల పనితీరు ఎలా ఉంది తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఎంపీడీఓ విజయశ్రీ, ఎంఈఓ కొమురయ్య, సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రమోదర్‌రెడ్డి, సదామోహన్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సర్వేను విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్ కోరారు. మండలంలోని తిడుగు, సాగరం, జఫర్‌గఢ్ తదితర గ్రామాల్లో సర్వేను రాధకిషన్, ఎంపీడీఓ సుమన్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

దుప్పట్ల పంపిణీ



జనగామ: డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనయుడు, యువ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని పట్టణంలోని ధర్మకంచ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో బుధవారం వృద్ధులు, వితంతువులు, అంధులకు పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నాయకులు వంగాల మల్లారెడ్డి, గాదెపాక రామచందర్, బొట్ల నర్సింగరావు, దుర్గేష్, శ్యామ్, నర్సింగరావు, మిద్దెపాక స్టాలిన్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పుస్తెమెట్టెల అందజేత



బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన రావురూపుల పద్మ, ఆనందం దంపతుల కూతురు అశ్విని వివాహానికి వాస్విక్ ఫౌండేషన్ తరఫున పుస్తెమెట్టెలను బుధవారం అందించారు. సభ్యులు ఆముదాల భూపాల్‌రెడ్డి, గణేష్, గొట్టె చంద్రమౌళి పాల్గొన్నారు.

కొన్నెలో..

కొన్నె గ్రామంలో చీర మాధవి, మహేందర్ దంపతుల కూతురు అక్షయ వివాహానికి సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్ గౌడ్ రూ. 5వేల సాయం అందజేశారు.

ప్రజాకవి కాళోజీ జీవితం చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న దయాకర్‌రావు తదితరులు

దేవరుప్పుల: బతుకంతా తెలంగాణకు అంకితం చేసిన ప్రజాకవి జీవితం చిరస్మరణీయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మాదాపురంలో కాళోజీ నారాయణ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి దయాకర్‌రావు పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా తన కలం ఎత్తి ఎదురు తిరిగిన గొప్ప నాయకుడు, స్వాతంత్ర్యసమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పీఎస్‌ఆర్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంటు రామ్‌సింగ్, మల్లేష్, మడికొండ ఎల్లయ్య, కొల్లూరి సోమన్న, కృష్ణమూర్తి, చిలుకాని రాజు, సోమనర్సయ్య, అర్జున్, రంగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన వైఫల్యంతో రైతు ఆత్మహత్యలు పునరావృతం

ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యంతో తెలంగాణ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు పునరావృతం కానున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని పచ్చర్లబాయి (ధరావత్‌తండా)లో పంట నష్టంపొందిన అంగోత్ సత్తెమ్మ కుటుంబానికి మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన పరిహారం రూ.5 లక్షల చెక్కును ఆయన ఇంటికెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ గత సీజన్‌లో కాల్వనీటీ సాగుపై ఆధారపడి వరిపంట వేస్తే చేతిబోర్లు వేసి నష్టం వాటిల్లిన ప్రాంతాన్ని కేసీఆర్ సందర్శించి ఇచ్చిన మాట నిలుపుకున్న కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేషం, రామ్‌సింగ్, విజయ్, చింత రవి తదితరులు ఉన్నారు.

వీడ్కోలు సమావేశం

జఫర్‌గఢ్: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన పూర్వ ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలదండలతో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


షుగర్ టెస్ట్ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

జనగామ రూరల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్త దానం చేయడం ప్రాణత్యాగంతో సమానమని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి లయన్ కన్న పరశురాములు అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ జనగామ మిలీనియం అధ్యక్షుడు గాదె నర్సింహులు అధ్యక్షతన పూర్వ అధ్యక్షుడు లయన్ కామిని శ్రీనివాస్ బాబు పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తదానాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ కార్యదర్శి వి. వేణుగోపాల్ రెడ్డి, సభ్యుడు కాముని ప్రసాద్‌తో పాటు 11 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే స్థానిక రైల్వే స్టేషన్ వద్ద 45 మందికి మధుమేహ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసారార్థులకు తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రవి, కె.ప్రభాకర్, శివసాయి, బి.ఎల్లమ్మ , ఎ.పోశమ్మ నర్సిరెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని స్వాతి అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని నెహ్రూపార్క్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పట్టణ కార్యదర్శి తోట హృతిక్ సాయి మాట్లాడుతూ.. అనుమానాస్పదంగా స్వాతి మృతి చెందితే తల్లిదండ్రులకు తెలియజేయకుండా పోస్టు మార్టానికి పంపించడం సరికాదన్నారు. న్యాయం చేయాలని కోరిన ఏబీవీపీ నాయకులపై సెక్యూరిటీ గార్డుల దాడి చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. గుంటుపల్లి కార్తీక్, వంశీ, నితీష్, మహేందర్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జీడికల్ జాతర ఏర్పాట్ల పరిశీలన


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీపీఓ స్వరూప

లింగాలఘణపురం: నేటి (గురువారం) నుంచి ప్రారంభమయ్యే జీడికల్ వీరాచల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం డీపీఓ స్వరూప పరిశీలించారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రత, నీటి వసతి, విద్యుత్ లైట్ల ఏర్పాట్ల కోసం దేవస్థాన సిబ్బందితో పాటు నాయకులతో చర్చించి ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచించారు. ఆమెతో పాటు మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్, ఈఓ వంశీ, ఎంపీఓ రఘురామకృష్ణ, నాయకులు మూర్తి, సంపత్, రాజు, ఐలేశ్, నవీన్, గంగాధర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


చిల్పూరు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం


రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న కుమార్‌గౌడ్

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ పేరాల సుధాకర్ భార్య వరలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామానికి చేరుకుని వరలక్ష్మి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సుధాకర్‌ను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పద్మశాలి సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గజ్జెల దామోదర్, తిరుమలగిరి తహసీల్దార్ బాసెట్టి హరిప్రసాద్, చిర్ర వెంకటేశ్వర్లు, బాసెట్టి వనజ, శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్‌పాల్ ఉన్నారు.

చిల్పూరులో..

మండల కేంద్రానికి చెందిన రాజారపు ప్రశాంత్ మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య బుధవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

నివాళి

రఘునాథపల్లి: మండలంలోని బానాజీపేట ఆర్‌ఎంపీ డాక్టర్ రచ్చ శ్రీహరి (58) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. కాగా, బుధవారం జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్ వివిధ పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మార్కెట్ మాజీ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, మాజీ సర్పంచ్ గైని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రచ్చ సోమనాథ్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూమిని పరిరక్షించాలి



పాలకుర్తి టౌన్: పేద దళితుల కోసం ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన పట్టా భూమిని పరిరక్షించాలని బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ విభాగం నాయకులు గుగ్గిళ్ల యాకయ్య, దొంతమల్ల గణేశ్, ఎడవెల్లి రమేశ్, గాదేపాక శ్రీను కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

సమన్వయంతో 'స్థానికం'లో సత్తా చాటాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: కొత్త, పాత తేడా లేకుండా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకు సాగి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. బుధవారం మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్‌హాల్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 40 ఏళ్లుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేకున్నా నాయకులు, కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేసారని, తనతో పాటు ఎంపీ కడియం కావ్య గెలుపులో కీలకభూమికను పోషించారని, కష్టపడి పనిచేసిన వారిని మరువనని, వారికి అవకాశాలను బట్టి సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల, గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు


అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: పట్టణంలోని బాణాపురం అయ్యప్ప ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి కాసోజు రాజేశ్వరాచార్యులు, అయ్యప్ప స్వాములు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించిన తర్వాత, ఎమ్మెల్యేను పూజారులు ఆశీర్వదించారు. 41 రోజుల పాటు మండల దీక్షబూని, అత్యంత నిష్ఠతో స్వామి ఆరాధనలో ఉండే స్వాముల కోసం తలపెట్టిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

డివిజన్ పరిధిలో కొత్తగా 490 వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు

స్టేషన్‌ఘన్‌పూర్: టీఎస్ ఎన్పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలో నూతన వ్యవసాయ సర్వీసు కనెక్షన్ల కోసం 490 దరఖాస్తులకు గాను త్వరలో సర్వీసు కనెక్షన్లు ఇవ్వనున్నట్లు డీఈ వై.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మండలాల వారిగా స్టేషన్‌ఘన్‌పూర్ 81, చిల్పూరు 88, జఫర్‌గఢ్ 100, పాలకుర్తి 165, కొడకండ్ల 56 ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం పంటల కోత సమయం కావడంతో త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా విద్యుత్‌శాఖ అధికారులుగాని, సిబ్బంది గాని డబ్బులు అడిగితే 1912 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

'రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం'


స్టేషన్‌ఘన్‌పూర్: రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వెంకటేశ్వర్లు


చిల్పూరు: మాట్లాడుతున్న యుగేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల సమస్యల్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగుతున్న అసమర్థపాలనను అంతమొందించేలా ప్రజలందరూ చైతన్యం కావాలని అన్నారు. రైతాంగ సమస్యలను విస్మరిస్తూ అన్నదాతలను ఆగం చేస్తున్నాడని, తెలంగాణ ప్రజలను ఆరు గ్యారంటీల పేరుతో దగా చేశాడని విమర్శించారు. తక్షణమే స్పందించి రైతాంగ సమస్యల్ని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు సట్ల రమణ, నాయకులు గంటె ఉపేందర్, గోనెల శ్రీనివాస్, పొన్నం కుమార్, సారయ్య పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చిల్పూరు: బీజేపీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషిచేయాలని వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ యుగేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో బుధవారం పార్టీ మండల సంస్థాగత ఎన్నికల నిర్వహణపై ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంపై అవగాహన కల్పించారు. ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్, అరూరి ప్రణీతప్రదీప్, తోట శ్రీనివాస్, అంజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మధు, దిలీప్ పాల్గొన్నారు.

ఆదర్శ ఆటోనగర్‌లో స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రకాశం

జనగామ రూరల్: జిల్లాలోని మెకానిక్‌లు, వెల్డింగ్ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు రోడ్డుపై పని చేసుకుంటూ కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వం వారికి 10 ఎకరాల స్థలాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు ఇండస్ట్రియల్ అధికారి ప్రకాశం బుధవారం పట్టణంలోని ఆటోనగర్‌లో వారికోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ భూమి కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆయన వెంట ఏఈ అజయ్, సర్వేయర్, ఉమేష్, ఆదర్శ ఆటోనగర్ అధ్యక్షుడు సాంబయ్య, ఉపాధ్యక్షుడు ఆమోస్, భాస్కర్, వెల్డింగ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బొట్ల శేఖర్, అబ్బు, ఎండీ అంజద్, ఎండీ గౌస్ ఉన్నారు.

నియామకం

రఘునాథపల్లి: కంచనపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జేరిపోతుల రవి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంఘం కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగ కైలాసం ప్రకటలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం కృషి చేస్తున్న రవిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించామన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు ఆయన పేర్కొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: సీపీఎం మండల కార్యదర్శిగా ఇప్పగూడెం గ్రామానికి చెందిన మునిగెల రమేశ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగరాయగూడెంలో జరిగిన సీపీఎం మండల మహాసభలో పార్టీ మండల కమిటీని జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల కమిటీ కార్యదర్శిగా మునిగెల రమేశ్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పార్టీ మండల కమిటీ కార్యదర్శిగా రెండోసారి ఎన్నికకావడం సంతోషంగా ఉందన్నారు. రంగరాయగూడెంలో జరిగిన మండల మహాసభను జయప్రదం చేసిన పార్టీ శ్రేణులు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'ఎమ్మెల్యేను గ్రామాల్లోకి రానివ్వొద్దు'


మాట్లాడుతున్న తాటికొండ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: అభివృద్ధి, నీతి, నిజాయతీ అంటూ పది నెలలుగా నియోజకవర్గంలో పైసా అభివృద్ధి చేయని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గ్రామాల్లోకి రానివ్వకుండా బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు, రైతులు తరిమికొట్టాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి కోసం పార్టీ మారితే తన ఎజెండా ప్రకటించాలని, అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ఇప్పటికైనా స్పందించి సెంటర్లలో జాప్యం చేయకుండా కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, ఆకుల కుమార్, సురేష్‌కుమార్, గణేష్, ప్రసాద్, మల్లేష్, చిట్టిబాబు, అశోక్, దేవయ్య, మహబూబ్‌పాషా, సుధాకర్, లింగయ్య పాల్గొన్నారు.